సాక్షి
కాకినాడ


మంగళవారం ၊ 25 ၊ మార్చి ၊ 2025



అతి వేగానికి ఇద్దరు యువకుల బలి

అతి వేగం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌లో మోటార్ సైకిల్‌ను కారు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహర్ బుధవారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.42
కాకినాడ	6.24	4.42
అమలాపురం	6.24	4.42

న్యూస్‌రీల్

మరిడమ్మ తల్లికి రూ.5.04 లక్షల ఆదాయం



మరిడమ్మ ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి రూ.5,04,914 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి విజయలక్ష్మి తెలిపారు. ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో సోమవారం తెరిచి, ఆదాయం లెక్కించారు. మొత్తం 129 రోజులకు గాను హుండీల ద్వారా రూ.43,069, అన్నదాన విరాళాలుగా రూ.4,61,845 వచ్చాయని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పీ–4 గ్రామసభ నుంచి సర్పంచ్ వాకౌట్



హంసవరం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మేరీ అవినాష్

తుని రూరల్: పేదలకు న్యాయం చేసేలా పీ–4 సర్వే పారదర్శకంగా నిర్వహించ లేదని ఆరోపిస్తూ హంసవరం గ్రామ సర్పంచ్ రాయి మేరీ అవినాష్ గ్రామసభ నుంచి వాకౌట్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందరికీ న్యాయం చేశామని, ఇప్పుడు కొందరికే న్యాయమన్నట్లు పీ–4 సర్వే చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో వందలాది పేద కుటుంబాలుండగా ఫ్యాన్లు, టీవీలు, గ్యాస్ కనెక్షన్లు వంటివి లేనివారినే పేదలుగా గుర్తించడమేమిటని ప్రశ్నించారు. పేదలకు న్యాయం జరగని గ్రామసభ నుంచి వాకౌట్ చేస్తున్నానని ప్రకటించారు. మండలంలోని 23 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరించామని ఎంపీడీఓ కె.సాయి నవీన్ తెలిపారు. కాగా, గత ప్రభుత్వంలో పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చారని, ఈ ప్రభుతంలో ఆ విధంగా ఎందుకు చేయడం లేదని పలువురు మహిళలు ఈ సందర్భంగా నిలదీశారు.

పీజీఆర్ఎస్‌కు 482 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 482 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్ఓ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కేఎస్ఈజెడ్ ఎస్‌డీసీ కేవీ రామలక్ష్మి, సీపీఓ పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు తదితరులు వినతులు స్వీకరించారు. వీటిని సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 80 ఫిర్యాదులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో పలువురు తమ సమస్యలపై ఫిర్యాదులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో 80 ఫిర్యాదులు అందాయని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. అర్జీదారుల సమస్యలను ఎస్పీ సావధానంగా విని, అర్జీలను పరిశీలించి, వీటిని చట్ట పరిధిలో పరిష్కరించాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

కంటి వెలుగుపై చీకటి

- కంటి వైద్య సేవలను నిలిపివేసిన కూటమి సర్కారు
- సీహెచ్‌సీల్లో మూత పడిన ఈ–ఐ కేంద్రాలు
- పేదలకు అవస్థలు



పిఠాపురం సీహెచ్‌సీలో మూతపడిన ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రం



పిఠాపురం: సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అంటారు. అటువంటి కంటి వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. పేదలను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యతను వదిలేసి, వారి కంట్లో అంధకారం నింపింది. ఎంతోమంది సామాన్యులకు కంటి వెలుగును ఇస్తున్న పథకాన్ని చీకట్లోకి నెట్టేసింది. కంటి సమస్యలతో బాధ పడుతున్న పేద, మధ్యతరగతి వర్గాలకు సేవలందించే లక్ష్యంతో కంటి వెలుగు కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించారు. అయితే, దీనిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పక్కాగా అమలు చేసింది. అప్పట్లో కంటి జబ్బులకు సంబంధించి ఓపీ దగ్గర నుంచి శస్త్రచికిత్సల వరకూ అన్ని సేవలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందించేవారు. ఆప్తాల్మిక్ అసిస్టెంట్లను కూడా నియమించారు. కంటి వైద్య సేవలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చారు.

గతంలో రోజూ 500 మందికి సేవలు

కంటి వెలుగు కార్యక్రమం కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి రోజూ జిల్లావ్యాప్తంగా 500 మందికి పైగా నిరుపేదలు కంటి వైద్య సేవలు పొందేవారు. ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల ద్వారా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్‌సీ) వైద్య సేవలు అందించేవారు. ఒక్కో ఈ–ఐ కేంద్రం ద్వారా ప్రతి రోజూ 30 నుంచి 50 వరకూ ఓపీ నమోదయ్యేది. అన్ని రకాల పరీక్షలు చేసిన అనంతరం, అవసరమైన వారికి రెండు వారాల్లోపే కళ్లద్దాలు అందించేవారు.

కళ్లల్లో పొరలు, శుక్లాల సమస్యలున్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేవారు. దీంతో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాలకు ఆదరణ పెరిగింది.

నిలిచిపోయిందిలా..

కంటి వెలుగు కార్యక్రమాన్ని అపోలో సంస్థ ద్వారా నిర్వహించేవారు. గత ఏడాది సెప్టెంబర్ 4వ తేదీతో ఆ సంస్థతో ఒప్పందం ముగిసింది. దీనిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడమో లేక వేరే ఏజెన్సీకి అప్పగించడమో చేయలేదు. దీంతో అప్పటి నుంచీ ఈ–ఐ కేంద్రాలు మూతపడ్డాయి. వీటిల్లోని వైద్య పరికరాలు, కంప్యూటర్లను కాంట్రాక్టు సంస్థ తరలించుకుపోయింది. దీంతో అన్ని సీహెచ్‌సీల్లోనూ కంటి వైద్య విభాగాలు మూతపడి, పేదలకు సంబంధిత సేవలు అందడం లేదు. మరో వైపు ఈ కార్యక్రమం నిలిచిపోవడంతో తమను తొలగించడమే కాకుండా వేతన బకాయిలు కూడా చెల్లించలేదని సిబ్బంది వాపోతున్నారు. అపోలో ఒప్పందం ముగిసేనాటికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల ద్వారా సుమారు 3 లక్షల మందికి కంటి చికిత్సలు అందించారు.

ప్రభుత్వ సేవలు లేక.. ప్రైవేటుకు వెళ్లలేక..

ఈ–ఐ కేంద్రాలు మూతపడటంతో పలువురు రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎక్కువగా వయో వృద్ధులు కంటి సమస్యలతో బాధ పడుతూంటారు. వారిలో ఎక్కువ మంది నిరుపేదలకు డబ్బు ఖర్చు చేసి, వైద్యం చేయించుకునే పరిస్థితి ఉండదు. అటువంటి వారు ఇప్పుడు కంటి వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంటి వైద్యం కోసం ఉదయాన్నే ప్రభుత్వాసుపత్రికి రావడం.. తీరా వచ్చాక ఈ సేవలు నిలిచిపోయాయని తెలిసి, డబ్బు పెట్టి ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లలేక వారు పడుతున్న వేదన వర్ణనాతీతం. ఒకవేళ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినా.. ఓపీ, ఇతర ఖర్చులు భరించలేక సతమతమవుతున్నారు. ప్రైవేటు కంటి ఆస్పత్రుల్లో కేవలం ఓపీకే రూ.300 వరకూ తీసుకుంటారు. కళ్లద్దాలు పడితే మరో రూ.1,000 నుంచి రూ.2,000 వరకూ అదనపు ఖర్చు. వీటికి మందులు కూడా తోడయితే పేదలపై మోయలేని భారం పడుతోంది. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వెంటనే ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల సేవలను పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వాన్ని సామాన్య రోగులు కోరుతున్నారు. దీనిపై వివరాలు తెలుసుకునేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో కంటి వెలుగు అధికారి డాక్టర్ ప్రసాద్‌ను ఫోనులో సంప్రదించడానికి ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం

గతంలో పిఠాపురం సీహెచ్‌సీలో నేను నాలుగు సార్లు కంటి వైద్యం చేయించుకున్నాను, కొన్ని రోజుల క్రితం వస్తే ఇక్కడ ఆ సేవలు లేవని చెప్పారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాను. ఇప్పుడైనా వైద్యం చేస్తారనే ఆశతో రోజూ వచ్చి చూస్తున్నాను. కనీసం ఎవరూ సమాధానం కూడా చెప్పడం లేదు. నాలాగే అనేక మంది పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఆర్థికంగా భారం పడుతోంది.

– బి.బాబూరావు, పిఠాపురం

క్షయ రహిత జిల్లాకు కృషి



టీబీ ర్యాలీలో పాల్గొన్న జేసీ రాహుల్ మీనా తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు కలసికట్టుగా కృషి చేద్దామని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. ప్రపంచ టీబీ దినం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ జెడ్పీ కార్యాలయం మీదుగా జ్యోతిబా పూలే విగ్రహం వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, క్షయ అంటువ్యాధి అని అన్నారు. రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు, రాత్రి పూట చెమట పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, మెడ వద్ద వాపు తదితర లక్షణాలుంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ సోకేందుకు ఎక్కువగా అవకాశం ఉన్న 60 ఏళ్లు దాటిన వారిని గుర్తించి, బీసీజీ టీకాలు వేయిస్తామని జేసీ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ మాట్లాడుతూ, వైద్యులు సూచించిన మేరకు మందులు వాడుతూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరు నెలల్లో టీబీని నయం చేయవచ్చని అన్నారు. వ్యాధిగ్రస్తులకు పోషకాహారం, ఇతర సహాయ సహకారాలు అందించేందుకు నిక్షయ మిత్రలు కృషి చేయాలని కోరారు. వ్యాధిగ్రస్తులు ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.700 ఇవ్వడం ద్వారా నిక్షయ మిత్రలుగా మారవచ్చన్నారు. ఎన్‌పీఐ కార్యక్రమంలో భాగంగా క్షయ రోగులకు ప్రభుత్వం రూ.1,000 చొప్పున అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ వెంకటరావు

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ మంగళ, బుధ, గురు వారాల్లో నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను డీఆర్ఓ జె.వెంకటరావు ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో అసిస్టెంట్ లైబ్రేరియన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, అనలిస్ట్ గ్రేడ్–2, ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారని వివరించారు. దీనికి కాకినాడ ఎస్.అచ్యుతాపురం వద్ద ఉన్న అయాన్ డిజిటల్ టెక్నాలజీ, కాకినాడ రూరల్‌లోని సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఆన్‌లైన్ పరీక్షలకు ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఎండ వేడి ఎక్కువగా ఉన్నందున వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్, ఇతర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 8 నుంచి 8.45 వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.45 గంటల వరకూ అనుమతిస్తామని తెలిపారు. ఉదయం పరీక్ష 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్: భారత ప్రభుత్వం – ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించే ప్రధాన మంత్రి యోగా అవార్డులు–2025కు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరావు సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారానికి కృషి చేసిన వారికి భారత ప్రభుత్వం ఈ అవార్డు ప్రదానం చేస్తుందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆసక్తి ఉన్న అభ్యర్థులు మై గవర్నమెంట్ పోర్టల్‌లో https://innovateindia.mygot.in/pm-yoga-awards-2025 వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేయించుకుని, సంబంధిత పత్రాలతో ఈ నెల 31లోగా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు 98499 13065, 89191 35344 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పంపాకు ఏలేరు జలాలు



శ్రీచక్రస్నానం నిర్వహించే పంపా ఘాట్ వద్ద అడుగంటిన నీటి నిల్వలు



పుష్కర అక్విడెక్ట్ వద్ద కాలువ నిర్మించనున్న ప్రదేశం

- వచ్చే నెల 15 నుంచి సరఫరా
- పోలవరం అక్విడెక్ట్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- రూ.22 లక్షలతో కాలువ, పైప్‌లైన్ల నిర్మాణం
- పోలవరం అధికారులకు కలెక్టర్ ఆదేశం

అన్నవరం: ఏలేరు రిజర్వాయర్ నుంచి పంపా జలాశయానికి ఏప్రిల్ 15వ తేదీ నుంచి నీటిని తరలించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. పంపా గర్భంలో జరుగుతున్న అక్విడెక్ట్ పనులకు ఆటంకం లేకుండా ఏలేరు నీరు వచ్చేందుకు వీలుగా ఆ రోజుకల్లా పోలవరం అధికారులు పుష్కర అక్విడెక్ట్ వద్ద కాలువ, పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో కాకినాడలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఏప్రిల్ 12న పంపా నదిలో శ్రీరాముని చక్రస్నానానికి, సత్యదేవుని వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మే 12న జరిగే సత్యదేవుని చక్రస్నాన మహోత్సవానికి అవసరమైన స్థాయిలో పంపాలో నీరు లేదని, అందువలన ఏలేరు నుంచి నీటిని విడుదల చేయాలని కలెక్టర్‌కు దేవస్థానం అధికారులు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ గత మంగళవారం అన్నవరం వచ్చి, పంపా జలాశయం, పోలవరం అక్విడెక్ట్ పనులను పరిశీలించారు. అనంతరం గత శుక్రవారం కాకినాడలోని తన కార్యాలయంలో ఇరిగేషన్, పోలవరం, దేవస్థానం అధికారులతో సమావేశమై, పంపా నీటి సమస్య పరిష్కారంపై చర్చించారు. పోలవరం పనులకు ఆటంకం లేకుండా ఏలేరు నీటి విడుదలకు కాలువ, పైప్‌లైన్ ఏర్పాటుకయ్యే వ్యయం అంచనాలను తనకు సమర్పించాలని ఆదేశించారు. ఈ పనులకు రూ.22 లక్షలు ఖర్చవుతుందని పోలవరం అధికారులు సోమవారం నాటి సమావేశంలో కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఆ మేరకు పనులు చేపట్టాలని, తాను నిధులు విడుదల చేస్తానని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పోలవరం ఈఈలు శ్రీనివాసరావు, గోవిందరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఈఈ నూకరత్నం, ఎలక్ట్రికల్ డీఈ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయండి

అన్నవరం దేవస్థానంలో నీటిని పొదుపు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. రోజుకు ఎంత నీరు వాడతారని దేవస్థానం అధికారులను ప్రశ్నించారు. సుమారు 10 లక్షల లీటర్ల నీటి వినియోగం జరుగుతుందని వారు బదులిచ్చారు. ఇందులో కనీసం 2 లక్షల లీటర్ల నీటిని ఆదా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర నిర్మాణ పనులు తప్ప మిగిలిన నిర్మాణాలు ఆపేయాలని చెప్పారు. వివిధ సత్రాలు, వాటర్ ట్యాంకుల నుంచి నీటి వృథాను అరికట్టాలని సూచించారు.

మరింత తగ్గిన పంపా

కాగా, పంపా జలాశయంలో నీటి నిల్వలు మరింత తగ్గిపోయాయి. పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు కాగా, ప్రస్తుతం 81 అడుగులకు పడిపోయింది. అలాగే, పూర్తి స్థాయి నీటి నిల్వలు 0.43 టిఎంసీలు కాగా, ప్రస్తుతం 0.011 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. రిజర్వాయర్ డెడ్ స్టోరేజ్ 0.007 టీఎంసీలు. మరో 0.004 టీఎంసీలు తగ్గితే దేవస్థానంతో పాటు, గ్రామానికి కూడా నీటి సమస్య తప్పదు.

కదం తొక్కిన ఆక్వా రైతులు

- లో ఓల్టేజ్ ముంచేస్తోందని ఆందోళన
- కోనసీమ జిల్లా అమలాపురంలో నిరసన ర్యాలీ



అమలాపురంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు

సాక్షి, అమలాపురం/అమలాపురం రూరల్: 'రొయ్యల కొనుగోలుదారుల గుత్తాధిపత్యం విడనాడాలి. ఆక్వా ధరలు ఇష్టానుసారం తగ్గించడం మానివేయాలి. రొయ్యల మేత ధరలు తగ్గించాలి. విద్యుత్ లో ఓల్టేజ్ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల రేట్లు తగ్గించాలి. విద్యుత్ అధికారుల అక్రమదాడులు నిలుపుదల చేయాలి' అని డిమాండ్ చేస్తూ ఆక్వా రైతులు కదం తొక్కారు. అమలాపురం వీధుల్లో సోమవారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ శివారు క్షత్రియ కళ్యాణ మండపం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ గడియార స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేట్, నల్లవంతెన మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. ఆక్వా రైతులు పెద్ద ఎత్తున పాల్గొని "విద్యుత్ బాదుడు ఆపండి.. ఆక్వా రైతులను ఆదుకోండి'' అనే నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వ విద్యుత్ విధానాలు.. కొనుగోలుదారులు సిండికేటుగా మారి తక్కువ ధరలకు రొయ్యల కొనుగోలు చేయడం వల్ల నష్టపోతుండడంతో కడుపు మండిన ఆక్వా రైతులు కోనసీమ ఆక్వా రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శనకు దిగారు. ఎస్‌పీఎల్ చార్జీలని, అదనపు లోడని, షార్ట్ ఫాల్ చార్జీలని వసూలు చేస్తూ ఆక్వా రైతుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఆక్వాకు విద్యుత్ రాయితీ ఇస్తున్నామని పేరుకే చెబుతున్నారు. ఏదో ఒక రూపంలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువులలో రొయ్యలు, చేపలు ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం అన్యాయమని రైతు ప్రతినిధులు వాపోయారు. ఆక్వా చెరువుల్లో రొయ్యలు లేని సమయంలో కౌంట్ ధరలు పెరిగాయి. పట్టుబడులు జరుగుతున్న సమయం చూసి రేటు తగ్గించి వేస్తున్నారు. కొనుగోలుదారులు సిండికేటుగా మారి రైతులను ముంచేస్తున్నారని ఆరోపించారు.

ఏసీడీ రూపంలో అధిక చార్జీలు



విద్యుత్‌శాఖ అధికారులు లో ఓల్టేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీనివల్ల మోటార్లు కాలిపోతున్నాయి. లో ఓల్టేజ్ వల్ల విద్యుత్ ఎక్కువగా వాడాల్సి వస్తోంది. సగం విద్యుత్ వాడుకున్నా.. అధికంగా వాడుకున్నట్టు చూపించి ఏసీడీ రూపంలో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో లోటు బడ్జెట్ ఉందని ఆదాయం పెంచాలని టార్గెట్ పెట్టడంతో అక్రమ మార్గంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం లేదు.

– దెందుకూరి సత్తిబాబు రాజు, ఆక్వా రైతు, టీడీపీ అల్లవరం మండలం శాఖ అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

గిన్నిస్ రికార్డ్స్‌లో మెప్మాకు చోటు



మెప్మా పీడీ ప్రియంవదను అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మెప్మా సంస్థ చోటు సంపాదించింది. మెప్మా మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను వాప్ జెని ఆన్‌లైన్ యాప్ ద్వారా లక్ష్యానికి మించి విక్రయించడం ద్వారా ఈ ఘనత సాధించింది. ఈ నేపథ్యంలో జిల్లా మెప్మా పీడీ బి.ప్రియంవద కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్క రోజులో లక్షకు పైగా ఉత్పత్తులు విక్రయించి, ఈ రికార్డ్ సాధించిన మహిళలను, పీడీ ప్రియంవదను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, డీఆర్ఓ జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 313 మంది గైర్హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం గణితం పరీక్ష జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 28,244 మందికి గాను 27,931మంది హాజరయ్యారు. 313 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు ఐదు కేంద్రాలను, డీఈఓ మూడు కేంద్రాలు తనిఖీ చేశారు. అలాగే, ఓపెన్ టెన్త్ పరీక్షలకు 2,025 మంది హాజరవగా 190 మంది గైర్హాజరయ్యారని డీఈఓ పిల్లి రమేష్ తెలిపారు.

నీటి చార్జీలపై పరిశ్రమలకు నోటీసులు

కాకినాడ సిటీ: జిల్లా కేంద్రమైన కాకినాడ పరిసర ప్రాంతాల్లోని ఏడు పరిశ్రమలు 2019 నుంచి నేటి వరకూ సుమారు రూ.87,21,91,000 మేర నీటి వినియోగ చార్జీలు బకాయి పడ్డాయని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ బకాయిలు చెల్లించాలని ఈ నెల 7న నోటీసులు జారీ చేసినా స్పందించలేదన్నారు. దీంతో సోమవారం మరోసారి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. నాగార్జున ఫెర్టిలైజర్స్, కాకినాడ సీ పోర్టు, జీఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్, ఎంపీ శశిధర్ అండ్ కో, అశోక్ ఎంటర్‌ప్రైజెస్, అంజనీ ఏజెన్సీస్, అన్నపూర్ణ మెరైన్స్ ఈ బకాయిలు పడ్డాయని తెలిపారు. తాజా నోటీసులపై 15 రోజుల్లోగా స్పందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

కోకోకు ఇదే సీజన్

- కోతలో మెళకువలు పాటించాలి
- గింజల గ్రేడింగ్‌తో అధిక ధరలు
- కోనసీమ జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణ



ఐ.పోలవరం: కోకో ఏడాది పొడవునా కాపు ఉన్నప్పటికీ మార్చి నుంచి మే నెలాఖరు అంటే మూడు నెలలపాటు అధిక దిగుబడులు వస్తాయి. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి ఉంటాయి. కోకో గింజల ధరలు పొందాలంటే విత్తనాల నాణ్యత పెంచాల్సి ఉంది. ఇందుకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని చెబుతున్నారు జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.వి.రమణ (89998 35469). కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్నందున నాణ్యమైన గింజల ఉత్పత్తి చేసేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఆయన మాటల్లోనే..

మన ప్రాంతంలో పండే కోకో గింజలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. ప్రపంచంలో ఘనా దేశం కోకో గింజన నాణ్యతలో ప్రథమస్థానంలో ఉండేది. దానిని ఇప్పుడు మనం అధిగమించాం. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలకు రికార్డు స్థాయిలో రూ.950 నుంచి రూ.1,000 వరకు ధర వచ్చింది. ఇప్పుడు ధర కొంత తగ్గినా మార్కెట్‌లో కేజీ ధర రూ.550 నుంచి రూ.650 వరకు ఉంటోంది. దీని వల్ల ఈ పంట రైతులకు పూర్తిగా లాభదాయకం. పైగా ఇది కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటగా సాగు చేస్తున్నందున రైతుకు అదనపు ఆదాయం వచ్చే పంట. కోకో చెట్టుకు అధికంగా ఆకు రాలుస్తుంది. ఈ కారణంగా రైతుకు రూపాయి పెట్టుబడి లేకుండా మంచి సేంద్రియ ఎరువు పొందే అవకాశముంది. ఇలా బహుళ ప్రయోజనాలు ఉన్న సాగుగా పేరొందిన కోకోలో మంచి దిగుబడి సాధిస్తే రైతులు మరింత లాభాలు పొందే అవకాశముంది. కోకోలో ప్రతి ఏటా రెండు సందర్భాలలో అధిక దిగుబడులు వస్తాయి. ఒకటి సెప్టెంబర్–జనవరి కాగా, రెండవది ఏప్రిల్–జూన్ మాసాలలో వస్తుంది. ఏప్రిల్ – జూన్ మాసాలలో వచ్చే దిగుబడి అధికంగా ఉంటుంది.


నాణ్యమైన కోకో గింజలు

పాడి–పంట

గింజల గ్రేడింగ్.. నిల్వ చేయడం

ఎండబెట్టిన గింజల నుంచి తప్పలు, ముక్కలు, ముడుచుకు పోయిన గింజలు, రాళ్లు తీసివేసి పాలిథీన్ లైనింగ్ (150–200 గేజు) కలిగిన గోనె సంచులలో నిల్వ చేసుకోవాలి. ఈ సంచులను ఎత్తైన అరుగుల మీద ఉంచాలి.

కృత్రిమంగా ఎండబెట్టడం

వర్షాకాలంలో గింజలను ఎండబెట్టటానికి విద్యుత్తు ఓవెన్స్ చాలా ఉపయోగపడతాయి. 72 నుంచి 96 గంటలలో గింజలు ఎండటం పూర్తవుతుంది. నెమ్మదిగా తక్కువ ఉష్ణోగ్రత వద్ద గింజలు ఎండటం వలన నాణ్యత బాగుంటుంది. ఓవెన్లో గింజలను 50–55 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద 8–10 గంటలు మాత్రమే మొదటి 2 రోజులు ఎండబెట్టాలి. తర్వాత 60 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద రోజంతా ఎండబెట్టవచ్చు. ఈ విధంగా 72 నుంచి 96 గంటలలో ఎండడం పూర్తవుతుంది.

బుట్ట పద్ధతి


ఎండబెట్టిన పద్ధతిలో కోకో గింజలు

తడిగింజ పరిమాణం తక్కువగా ఉన్నప్పుడు వెదురు లేదా కేను బుట్టలను పులియబెట్టడానికి వాడుకోవచ్చు. వెదురుబుట్ట లోపలి అంచులను అరటి ఆకులతో కప్పాలి. బుట్ట అడుగుభాగం మాత్రం ఆకులతో కప్పకూడదు. బుట్టను గింజలతో నింపి అరటి ఆకులతో కప్పాలి. దానిపైన కొద్ది బరువును ఉంచాలి. బుట్టను నేలకు తగలకుండా కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉంచడం వలన గింజలకున్న గుజ్జు సులభంగా బుట్ట అడుగు భాగం నుండి కారిపోతుంది. తరువాత బుట్టను గోనె సంచితో కప్పాలి. గింజలను 3వ, 5వ రోజున కలిపి, గోనె సంచితో కప్పాలి. ఆరు రోజులలో పులియడం పూర్తవుతుంది.

ఎండబెట్టడం: పులియబెట్టిన గింజలను పల్చగా సిమెంటు గచ్చు మీద గాని, వెదురు చాప మీద గాని 5 – 6 రోజుల వరకు ఎండబెట్టాలి. మధ్యలో గింజలను కలియబెడుతూ ఉండాలి. ఎండిన గింజలలో తేమ 67 శాతం మాత్రమే ఉండేలా చూసుకోవాలి.

కాయ కోత – మెళకువలు

పసుపుచార వచ్చిన లేదా పక్వానికి వచ్చిన కాయలను పదునైన కత్తితో కోయాలి. అయితే కాయకు ఉండే చిన్న పాటి కాండం (తొడిమ) చెట్టుకు ఉండేటట్టు చూడాలి. కాండంతో కాయ కోస్తే దాని చుట్టూ వచ్చే పూత దెబ్బతింటుంది. కోసిన కాయలను 2 నుంచి 3 రోజులు నిల్వ చేసిన తర్వాత పగుల గొట్టి గింజలు తీయాలి. కాయలను కర్రతో మధ్య భాగంలో బద్దలు కొట్టి, గింజలను గుజ్జుతో సహా వేరు చేయాలి. కాయ మధ్య భాగంలో ఉన్న కాడను, తొక్కను పులియ బెట్టడానికి ముందు తొలగించాలి.



కాయకు ఉండే చిన్న పాటి కాండం (తొడిమ) చెట్టుకు ఉండేటట్టు కోకో కాయ కోత

కోకో గింజల ప్రాసెసింగ్

పులియ బెట్టడం: కోకో గింజలు చుట్టూ వున్న గుజ్జును తొలగించడానికి, మంచి సువాసన, రుచిని కలిగించడానికి పులియ బెట్టడం మంచి పద్ధతి. గింజలలో అమ్లతను 5.5కు తీసుకు రావడం, వగరు, చేదును తగ్గించడానికి, గింజలో మొలకను చంపడానికి, చుట్టూ వున్న పల్చని తొక్కను తొలగించడానికి పులియ బెట్టడం చాలా అవసరం. పెట్టె పద్ధతి, ట్రే పద్ధతి, బుట్ట పద్ధతి ద్వారా కోకో గింజలను పులియబెట్టడం మంచిది.

పెట్టె పద్ధతి

60 సెం.మీ. ఇన్‌టు 60 సెం.మీ. ఇన్‌టు 45 సెం.మీ. సైజు కర్రలతో చేసిన పెట్టెలు అవసరం. కారిన గుజ్జు పోవడానికి, గాలి తగలడానికి పెట్టె కింద రీపర్ బద్దలు నాటాల్సి ఉంది. తడి గింజలను పెట్టెలో దగ్గరగా అమర్చి అరటి ఆకులతో గాని (లేదా) గోనె సంచులతో గాని కప్పాలి. 24 గంటల తరువాత వేరే పెట్టెలోకి మార్చేటప్పుడు గింజలను మళ్లీ కలపాలి. సమానంగా పులవడానికి సరియైన ఉష్ణోగ్రత తేమ, గాలి ఉండేలా చూడడం ఎంతో అవసరం. పెట్టెలో 48 గంటల తరువాత ఉష్ణోగ్రత 42 నుంచి 48 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరుగుతుంది. పులియబెట్టిన 72 గంటల తరువాత గింజలను వేరే పెట్టెలోకి మార్చాలి. ఒక రోజు తరువాత చివరిగా గింజలను మార్చాలి. ఈ విధంగా పులియడానికి 6 రోజులు అవసరమవుతుంది.


పెట్టెలో పులియబెట్టిన కోకో గింజలు

అతి వేగానికి ఇద్దరు యువకుల బలి

- మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన కారు
- ఒకరు అక్కడికక్కడే మృతి, మరొకరు ఆసుపత్రిలో..
- కన్నీరు మున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు


సురేష్ (ఫైల్)


హనుమంతు (ఫైల్)


ప్రమాద స్థలిలో మృతి చెందిన సురేష్


ఆసుపత్రిలో మృతి చెందిన హనుమంతు


ప్రమాదానికి కారణమైన కారు

పెరవలి: అతి వేగం ఇద్దరు యువకులను బలి తీసుకుంది. జాతీయ రహదారిపై పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. పెరవలి ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామానికి చెందిన మాకా సురేష్ (26), నేతల హనుమంతు (26) అన్నవరప్పాడు సెంటర్‌లో మోటార్ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు వచ్చిన వేగానికి మోటార్ సైకిల్ గాలిలోకి ఎగిరి సుమారు 20 మీటర్ల దూరంలో పడి ఆగివున్న మరో కారును ఢీకొట్టి పడిపోయింది. దీంతో మాకా సురేష్ తలకు బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు, మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన వెంటనే పెద్ద శబ్దం రావటంతో సెంటర్‌లో ఉన్న జనం పరుగున వచ్చి పడిపోయిన ఇద్దరిని లేపటానికి ప్రయత్నించారు. వీరిలో మాకా సురేష్‌లో ఎటువంటి కదలిక లేదు. నేతల హనుమంతు కదులుతుండటంతో హైవే అంబులెన్స్‌కు ఫోన్ చేయటంతో వెంటనే వచ్చి తణుకులో ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలానికి వచ్చిన సురేష్ తండ్రి వెంకటేశులు, తల్లి కన్నీరు మున్నీరుగా విలపించారు. తీవ్ర గాయాలైన నేతల హనుమంతు తండ్రి ప్రసాద్, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లే సమయానికి కుమారుడు మృతి చెందాడని తెలిసి హతాశులయ్యారు. మాకా వెంకటేశులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాలకు వీరే ఆధారం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి కుటుంబీకులు పేదలు. రెండు కుటుంబాలకు వీరే ఆధారం. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు, కుమారులు మృతితో ఇరు కుటుంబాలు తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నాయి. మాకా వెంకటేశులు, భార్య ధనలక్ష్మిలకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు సురేష్. ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేశారు. తల్లి తండ్రులకు సురేష్ ఒక్కడే ఆధారం. అతను ఇలా రోడ్డు ప్రమదంలో మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నేతల హనుమంతు తండ్రి ప్రసాద్, కృష్ణవేణిలకు ముగ్గురు పిల్లలు పుట్టగా హనుమంతు అన్న మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ప్రస్తుతం మృతుడి చెల్లికి వివాహం జరిగింది. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో హనుమంతు మృతిచెందటంతో తల్లితండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. హనుమంతు తెచ్చిన కూలి డబ్బులే ఈ కుటుంబానికి జీవనాధారం కావటంతో తల్లితండ్రులు బిడ్డ పోయాడని ఒకవైపు రోదిస్తూ మమ్మల్ని ఎవరు ఆదుకుంటారు అంటూ విలపిస్తుంటే చూపరులు కూడ కన్నీటి పర్యంతం అయ్యారు. తల్లితండ్రులు ఇద్దరు భగవంతుడా మీకు ఏమి అన్యాయం చేశాము, ఈ చివరి క్షణాల్లో మమ్మల్ని ఆదుకునేదెవరు, ఒక బిడ్డను ముందు తీసుకెళ్లావు. అది మర్చిపోకముందే రెండవ బిడ్డను తీసుకెళ్లిపోయావా అంటూ హృదయ విదారకంగా విలపించారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిఘా కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. యువత, విద్యార్థులు బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల జీవనశైలిని గమనించి బెట్టింగుల పట్ల ఆకర్షితులైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగులు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112, 100 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 94949 33233కు సమాచారం ఇవ్వాలన్నారు.

గోదావరిలో దూకి

వ్యక్తి ఆత్మహత్య


కలివరపు చాణక్య (ఫైల్)

కొవ్వూరు: నందమూరు గ్రామానికి చెందిన కలివరపు చాణక్య(36) సోమవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బై పోలార్ అనే వ్యాధితో బాధపడుతున్న చాణక్య ఉదయం ఇంటి నుంచి బయల్దేరి రోడ్డు కం రైలు వంతెన పై నుంచి గోదావరి నదిలో దూకారు. పోలీసులు రెస్క్యూ టీము సహకారంతో నదిలో గాలించారు. ఎరినమ్మ ర్యాంపు సమీపంలో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


గోదావరి నుంచి వెలికితీసిన చాణక్య మృతదేహం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఏపీఎస్పీ కానిస్టేబుల్ భార్యకు చెక్కు అందజేత


మధుబాబు భార్య ఆదిలక్ష్మికి చెక్కు అందజేస్తున్న కమాండెంట్

కాకినాడ రూరల్: ఏలూరులో ఇటీవల రైలు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఆర్.మధుబాబు (పీసీ – 4263) భార్య ఆదిలక్ష్మికు అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కును కమాండెంట్ నాగేంద్రరావు సోమవారం అందజేశారు. రమణయ్యపేటలోని బెటాలియన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు మురళీమోహన్‌రావు, అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ అనిల్ జాన్సన్ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పిఠాపురం రూరల్ ఎస్సై

రూ.20,000 లంచం తీసుకుంటూ చిక్కిన వైనం


ఏసీబీకి పట్టుబడ్డ ఎస్సై గుణశేఖర ఆయన వ్యక్తిగత డ్రైవర్

పిఠాపురం: పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ రూ.20,000 లంచం తీసుకుంటూ సోమవారం రాత్రి ఏసీబీకి చిక్కారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురం మండలం పి. దొంతమూరుకు చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజు నుంచి ఒక కేసుకు సంబంధించి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి బాధితులు ఎస్సైకి లంచం ఇవ్వగానే ఏసీబీ అధికారులు వలపన్ని దాడి చేసి లంచం తీసుకుంటున్న ఎస్సైతో పాటు మధ్యవర్తిగా పనిచేస్తున్న ఎస్సై వ్యక్తిగత డ్రైవర్ శివను పట్టుకున్నారు. జరిగిన ఘటనపై కాకినాడ అడిషనల్ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ శాఖపరమైన విచారణ చేపట్టారు.

గంజాయి సరఫరా చేసే 14మందిపై చర్యలు

జగ్గంపేట: పోలీసు సర్కిల్ పరిధిలో గంజాయి అమ్మకం, సరఫరా దారులుగా అనుమానంతో పట్టుకున్న 14మందిపైపై సస్పెక్ట్ షీట్స్‌ను ఓపెన్ చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు తెలిపారు. జగ్గంపేట పరిసరాలలో బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న నలుగురిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేసినట్లు తెలిపారు.

పశివేదలలో చోరీ

ఎనిమిది కాసుల బంగారం, ఐదు కిలోల వెండి అపహరణ

కొవ్వూరు: పశివేదల గ్రామంలో పావులూరి రమా సుందరి అనే మహిళ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలు, ఐదు కిలోల వెండి వస్తువులు అపహరించుకుని పోయారు. ఈమె కుమారుడు మహేష్ శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. రాత్రి ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో శివాలయం వద్ద ఉంటున్న కుమారుడు వద్దకు ఆమె వెళ్లారు. మెస్ డోర్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న ఆభరణాలను అపహరించుకుని పోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి చోరీకి జరిగినట్లు బాధితురాలు గుర్తించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్. భగవాన్‌దాస్ తెలిపారు.

ప్రభుత్వం టైలర్స్‌ను పట్టించుకోవడం లేదు


విలేకరులతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

బోట్‌క్లబ్ (కాకినాడ): రాష్ట్ర ప్రభుత్వం టైలర్స్‌ను పట్టించుకోవడం లేదని ఏపీ టైలర్స్ కో– ఆపరేటివ్ సొసైటీల పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి బీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జగన్నాథపురంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రూ.కోటి మూలధనంతో టైలర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేశారన్నారు. గ్రామస్థాయిలో టైలరింగ్ సొసైటీలు ఏర్పాటు చేసి చేనేత జౌళిశాఖకు అప్పగించారన్నారు. అప్పటిలో 300 సొసైటీలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. పాదయాత్ర సమయంలో టైలర్స్ బాధలు స్వయంగా తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ ఏడాది ఆర్థిక సహాయం చేసేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టైలర్స్‌ను అసలు పట్టించుకోవడం లేదన్నారు. కులవృత్తులకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ఈ ప్రభుత్వం టైలర్స్‌ని పరిగణలోనికి తీసుకోలేదన్నారు. 145 కుల వృత్తులను పరిగణలోనికి తీసుకొని టైలర్స్‌ను పక్కన పెట్టడం చాలా దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది పరోక్షంగా ఈ టైలరింగ్ వ్యవస్థపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం మా టైలర్స్ న్యాయం చేయాలని కోరారు. కుల వృత్తుల్లో భాగంగా మాకు కావాల్సిన టైలరింగ్ మెషీన్లు ఇవ్వాలన్నారు.

మోటారు సైకిల్, ఆటో ఢీ

ఐదుగురికి గాయాలు


ప్రమాద స్థలిలో గాయపడ్డ ప్రయాణికులు

జగ్గంపేట: జగ్గంపేట గ్రామ పరిధిలోని జాతీయ రహదారి 16 బ్రిడ్జిపై సోమవారం మోటారు సైకిల్, ఆటో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, మరో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న మోటారు సైకిలిస్టు బ్రేక్ వేయడంతో అతని వెనుకాల వస్తున్న ఆటో అతన్ని ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తి రోడ్డుపై పడిపోయాడు. ఆటో బ్రిడ్జి గోడను ఢీకొని పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.